క్లుప్తంగా

అంగన్‌వాడీ టీచర్ పోస్టును భర్తీ చేస్తాం

మన్ననూర్: అమ్రాబాద్ మండలం కొమ్మెన్‌పెంటలో జన్‌మన్ పథకం ద్వారా ఏర్పాటు చేయనున్న అంగన్‌వాడీ కేంద్రానికి టీచర్ పోస్టు, ఆయా పోస్టులను భర్తీ చేస్తామని అచ్చంపేట సీడీపీఓ దమయంతి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించి ఉన్నతాధికారుల సూచన మేరకు నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

అయోధ్య రాముడి అక్షతలు పంపిణీ



చారకొండ: మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం అయోధ్య రాముడి అక్షతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు భక్తిగీతాలను ఆలపిస్తూ ఇంటింటికి వెళ్లి అక్షతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అధ్యక్షుడిగా మల్లయ్య



అచ్చంపేట రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ నియోజకవర్గ నూతన కమిటీని గురువారం అచ్చంపేటలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేడమోని మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా పదర వెంకటేష్, కోశాధికారిగా గణేష్, గౌరవ అధ్యక్షుడిగా రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణు, ఉపాధ్యక్షులు వెంకటేష్, సాయిలు, సహాయ కార్యదర్శులు నర్సింహ్మ, రాధ, ప్రచార కార్యదర్శి చెన్నయ్య, కమిటీ సభ్యులను ఎన్నికున్నారు. మల్లయ్య ఎన్నిక పట్ల పలువురు హర్షం ప్రకటించారు.

బీజేపీకి సతీష్‌మాదిగ రాజీనామా

అచ్చంపేట రూరల్: బీజేపీకి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సతీష్‌మాదిగ గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి రాజీనామా పత్రాన్ని పంపించినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తునట్లు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి సోషల్‌మీడియాలో లేఖ పోస్ట్ చేయడంపై బాధేసిందని వివరించారు. నాగర్‌కర్నూల్ ఎంపీ సీటు కోసం ప్రయత్నిస్తున్న తరుణంలో పార్టీ నుంచి కుట్రపూరితంగా సస్పెండ్ చేశారని పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో జంగాచారి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు గురువారం బాధితుడిని పరామర్శించారు. రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన మున్నిబేగం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గ్రామానికి చెందిన సత్యహరిచంద్ర ఫౌండేషన్ చైర్మన్ రాములు యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం 50 కేజీల బియ్యం అందజేశారు. నాయకులు నూర్పాల్, కమాలోద్దిన్, శ్రీనివాస్ గౌడ్, సాయిలు, వెంకటయ్య, ఖాజా గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

అదృశ్యమైన మహిళ హత్య?

కల్వకుర్తిరూరల్: మూడు రోజుల కిందట అదృశ్యమైన మహిళ హత్యకు గురైనట్లు తెలిసింది. మండలంలోని తర్నికల్ గ్రామానికి చెందిన నాగమ్మ మంగళవారం వివిధ పనుల నిమిత్తం గ్రామం నుంచి కల్వకుర్తికి వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. కాగా మహిళ ఆచూకీ కోసం ప్రయత్నించగా అచ్చంపేట మండలం రంగాపూర్ ఉర్సు ప్రాంతంలో హత్యకు గురైనట్లు తెలిసింది. ఓ ఆటోడ్రైవర్‌పై అనుమానం ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు శుక్రవారం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

ఆధార్ అవస్థలు



ఆధార్ నమోదు కోసం బారులు తీరిన చెంచులు

మన్ననూర్: చెంచులకు ఆధార్ కార్డులు అందించాలని ఉద్దేశ్యంతో గతంలో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా పలు చెంచుపెంటలకు చెందిన ప్రజలు ఆధార్ నమోదు చేసుకున్నారు. కాని వారికి ఇప్పటివరకు ఆధార్ కార్డులు అందలేదు. దీంతో సమస్య మొదటికే వచ్చింది. గతంలో పలు మార్లు ఆధార్ నమోదు చేసినట్లు ఒక పత్రం (రశీదు) ఇచ్చినప్పటికి అందుకు సంబంధించిన ఆధార్ కార్డులు మాత్రం ఇవ్వడం లేదని చెంచులు వాపోయారు. ఐదు రోజుల నుంచి నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలోని చెంచుల కోసం అమ్రాబాద్, పదర, లింగాల, కొల్లాపూర్‌లలో ప్రత్యేకంగా ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసి సుమారు 400 మందికి సంబంధించి ఆధార్ నమోదు ప్రక్రియ నిర్వహిస్తుండటం గమనార్హం. అమ్రాబాద్, లింగాల మండలాలకు చెందిన మల్లాపూర్, పుల్లాయిపల్లి, ఫరహాబాద్, అప్పాపూర్, రాంపూర్, భౌరాపూర్, మేడిమల్కల, సంఘిడి గుండాలు, ఈర్లపెంట, కొల్లం, కొమ్మన్‌పెంట, సార్లపల్లి, కుడిచింతలబైలు, తిర్మలాపూర్, బీకే ఉప్పునుంతల తదితర గ్రామాలు పెంటలకు చెందిన చెంచులు మన్ననూర్‌లోని రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రానికి తమ పిల్లలతో తరలి వచ్చి ఆధార్ నమోదు చేయించుకున్నారు. నమోదు చేసినప్పటికి మారుమూల ప్రాంతాల్లో ఉండే చెంచులకు ఆధార్ కార్డులు చేరవేస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నిసార్లు ఆధార్ నమోదు చేసుకున్నా రశీదులు మాత్రమే ఇస్తున్నారు కాని ఆధార్ కార్డు మాత్రం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకీ ఫొటోలు ఎందుకు దించుతున్నారో తెలియని గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఈ సారైనా అధికారులు బాధ్యత తీసుకుని ప్రస్తుతం నమోదు చేసిన ఆధార్ కార్డులు వచ్చిన తర్వాత ఎవరి పెంటలో వారికి అప్పగించాలని చెంచులు కోరుతున్నారు.

ఆధార్ కార్డు రాలేదు..



ఇంతకు ముందు రెండు సార్లు ఆధార్ నమోదు చేసుకున్నా. రశీదు మాత్రమే ఇచ్చారు. ఆధార్ కార్డు ఇవ్వలేదు. ఇద్దరు పిల్లలను తీసుకొని ఆగర్లపెంట నుంచి మన్ననూర్‌కు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ఆధార్ కార్డులు ఇచ్చేందుకు అధికారులు బాధ్యత తీసుకోవాలి.

– బల్మూరి లింగమ్మ, ఆగర్లపెంట

రశీదులు ఇచ్చారు..



ఆధార్ నమోదు కేంద్రంలో ఫొటోలు దిగి వచ్చాం. నిర్వాహకులు రశీదు ఇచ్చారు. ఆధార్ ఎప్పుడు వస్తుందో చెప్పడం లేదు. రెండు రోజులు తిండి లేక ఇక్కడే ఉన్నాం. సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– తోకల గురువయ్య, ఈర్లపెంట

సేవాభావంతోనే సంతృప్తి

అచ్చంపేట రూరల్: సేవాభావంతోనే సంతృప్తి కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ మల్లురవి అన్నారు. రంగాపూర్ నిరంజన్ షావలీ ఉర్సు జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం గురువారం గీతాంజలి స్కూల్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సేవగుణం కలిగి ఉండాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం వైద్య సేవలు అందించడంపై నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు రఘు నాయక్, వైద్యులు మహేష్, చంద్రశేఖర్, భీష్మ నాయక్ పాల్గొన్నారు.



వైద్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, మల్లురవి

ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం పట్టణంలో పీఆర్‌టీయూ టీఎస్ క్యాలెండర్లు, డైరీలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్‌టీయూ నాయకుల కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాంచందర్‌రావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రంగినేని కృష్ణ, ఉపాధ్యక్షుడు అర్జున్‌గౌడ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరయ్య, శ్రీకాంత్, కురుమయ్య, బలరాం, కృష్ణయ్య, బసీర్, ఈశ్వర్, లోకేష్ తదితరులున్నారు.

రక్తదానం మహాదానం



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తిరూరల్: రక్తదానం మహాదానం అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే జన్మదినం పురస్కరించుకుని లయన్స్ క్లబ్ కల్వకుర్తి, కాంగ్రెస్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబారాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో మొత్తం 117 మంది రక్తదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ ఆపద్బాంధవులు రక్తదాతలు అని కొనియాడారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ జూలూరు రమేష్ బాబు మాట్లాడుతూ యువకులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు కల్మిచర్ల రమేష్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, మాజీ సర్పంచ్ ఆనంద్, సుదర్శన్‌రెడ్డి, బచ్చు రామకృష్ణ, క్లబ్ కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి శ్రీనివాస్, బ్లడ్‌బ్యాంపు చైర్మన్ మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాములు, నిజాముద్దీన్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కల్వకుర్తి: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. పలువురు ప్రభుత్వ శాఖల అధికారులు, పలు ప్రజా సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల బాధితులు ఎమ్మెల్యేను కలిశారు. అర్హులందరికి ఇళ్లు కేటాయించాలని కోరారు.

వెల్దండ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, మోతీలాల్‌నాయక్, సర్పంచ్ భూపతిరెడ్డి, నాయకులు సంజీవ్‌కుమార్, మట్ట వెంకటయ్యగౌడు, రషీద్, పర్వత్‌రెడ్డి, పుల్లయ్య, ఎర్రశ్రీనుముదిరాజ్ ఉన్నారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గ్రామ శివారుల్లో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ కరుణాకర్‌రెడ్డి పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం హైదరాబాదు-శ్రీశైలం జాతీయ రహదారిపై అచ్చంపేట నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు పెద్దాపూర్ రెవెన్యూ శివారులో ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ఇద్దరు కారు డ్రైవర్లకు, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. కారు డ్రైవర్ మహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టిప్పర్ల డ్రైవర్లపై..

వెల్దండ: మండలంలోని చెర్కూర్ రెవెన్యూ శివారుల్లో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు మట్టి టిప్పర్లపై గురువారం పట్టుకునట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం రాత్రి అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు మట్టి టిప్పర్లను అదుపులోకి తీసుకొన్నామన్నారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాకు చెందిన టిప్పర్ల డైవర్లు నేనావత్ దేవేందర్, లక్ష్మణ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. గురువారం వారిని తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలు

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్-కుప్పగండ్ల రోడ్డులో బైక్ అదుపుతప్పి ఒకరికి తీవ్రగాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పెద్దాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి భగవంత్ ద్విచక్ర వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి వ్యవసాయ పొలానికి వెళ్లాడు. కుప్పగండ్ల నుంచి పెద్దాపూర్ వైపు ఉర్కొండ మండల కేంద్రానికి చెందిన శివ ద్విచక్రవాహనం వెళ్తూ ప్రమాదవశాత్తు ఆగిఉన్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంతో శివకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పరామర్శ

అమ్రాబాద్: మండలంలోని తిర్మలాపూర్(బీకే) గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దరగోని వెంకటేష్ మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు, అదే విధంగా మండల కేంద్రానికి చెందిన బరుపటి బాల్‌సాయిలు ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనురాధ గురువారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆట, పాటలతో చదువుపై ఆసక్తి

వీపనగండ్ల: అంగన్‌వాడీ చిన్నారులకు ఆట పాటల ద్వారా విద్య అందించడం వల్ల రాబోయే రోజుల్లో వారు ఉన్నతంగా రాణించగలుగుతారని అంగన్‌వాడీ టీచర్ సుగుణాభాయి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో ఆట పాటలతో పాటు వివిధ ఆకృతులు, కలర్లతో కూడిన బొమ్మలతో చిన్నారులకు విద్యాభ్యాసం చేశారు. కార్యక్రమంలో ఆయా ఈశ్వరమ్మ, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో వైస్‌చైర్మన్‌గా రాజేందర్‌రెడ్డి

వెల్దండ: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో వైస్ చైర్మన్‌గా రాజేందర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సింగిల్‌విండో కార్యాలయంలో గురువారం వైస్‌చైర్మన్ ఎన్నికకు షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్దండకు చెందిన డైరెక్టర్ రాజేందర్‌రెడ్డి, రాచూర్‌కు చెందిన డైరెక్టర్ రాఘవేందర్‌రెడ్డి ఉదయం నామినేషన్లు వేశారు. వారిలో రాఘవేందర్‌రెడ్డి నామినేషన్ పత్రాన్ని విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో సింగిల్‌విండో వైస్‌చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవమైంది. రాజేందర్‌రెడ్డికి ఎన్నికల అధికారులు నియామక పత్రాలు అందించారు.



సింగిల్‌విండో వైస్‌చైర్మన్‌గా ఎన్నికైన రాజేందర్ రెడ్డిని సన్మానిస్తున్న డైరెక్టర్లు

దీంతో పాటు డైరెక్టర్లు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శేఖర్‌ముదిరాజ్, నాగులు నాయక్, గండయ్య, సంతోష, ఎల్లమ్మ, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత



బహుమతులు అందజేస్తున్న నక్క వేణుగోపాల్‌యాదవ్

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లిలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీలు గురువారం ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్వీ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు నక్క వేణుగోపాల్ యాదవ్ గెలుపొందిన వారికి బహుమతులతో పాటు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. యువకులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వంగ రాజశేఖర్‌గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ ఆంజనేయులు, ఎంపీటీసీ హనుమాన్, మాజీ వైస్ ఎంపీపీ వెంకటస్వామి, మాజీ సింగిల్ విండో చైర్మన్ కొండల్‌రావు, మల్లేష్, ఆంజనేయులు, బీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి ఆలయంలో స్వచ్ఛ అభియాన్

కందనూలు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ఆలయాల స్వచ్ఛ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని సరస్వతి ఆలయంలో బీజేపీ నాయకులు చెత్తను తొలగించారు. ఆలయ గోపురాన్ని నీళ్లతో కడిగి, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రామమందిరం ప్రారంభోత్సవ కార్యక్రమం 150 దేశాల నుంచి భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొంటారని పేర్కొన్నారు. హిందువుల ఆత్మగౌరవానికి సంబంధించిన ఆధ్యాత్మిక వేడుకలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎలిమెరాము, మహిళామోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొడ్ల రాధారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మాయని శ్రీశైలం, పట్టణ ప్రధాన కార్యదర్శి చెవ్వ ప్రమోద్ కుమార్, నాయకులు ఎస్ రామచంద్రారెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలి

పెద్దకొత్తపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భారత్ వికాస్ విదర్భ కార్యక్రమాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చంద్రబండ తండాలో గిరిజనులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యంపై తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని కోరారు. చిరుధాన్యాలను తరుచుగా తీసుకోవాలని సూచించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్, బాలాజీసింగ్, శిరీష, నాగమణి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

బీటీకి నోచుకోని కోలొంపు రోడ్డు



కోలొంపు మట్టి రోడ్డు

తాడూరు: మండల కేంద్రం నుంచి ఇంద్రకల్, ఐతోలు మీదుగా జడ్చర్లకు వెళ్లే నాలుగు కిలోమీటర్ల లింకు రోడ్డు బీటీ నిర్మాణం చేయాలని గతంలో అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. బీటీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీ నీటి మీదరాతలాగే మిగిలిందని గ్రామస్తులు ఆరోపించారు. మట్టి రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీటీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

భగవంతు మృతి తీరనిలోటు

తెలకపల్లి: సీపీఐ నాయకుడు పెరుమాండ్ల భగవంతు మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల్‌నర్సింహ అన్నారు. గురువారం మండలంలోని పెద్దపల్లి గ్రామంలో భగవంతు మృతదేహంపై ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాల్‌నర్సింహ మాట్లాడుతూ సీపీఐ పార్టీ బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. నిజాం నవాబు పాలనకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. అదేవిధంగా ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి పెద్దపల్లిలో భగవంతు భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేశవులు గౌడ్, శంకర్‌గౌడ్, బుగ్గస్వామి, మల్లేష్, రాములు, బాలకిష్టయ్య, వెంకటయ్య గౌడ్, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న రాష్ట్ర నాయకుడు బాల్‌నర్సింహ

దర్జీ బతుకులు అధ్వానం

- అంతంత మాత్రమే గిరాకీ



గిరాకీ లేక ఖాళీగా కూర్చున్న టైలర్లు

కోడేరు: రోజురోజుకు దర్జీల బతుకులు అధ్వానంగా మారుతున్నాయి. రెడీమేడ్ దుస్తులు అందుబాటులో ఉండటంతో దర్జీల వద్ద దుస్తులు కుట్టించేందుకు పట్టణ ప్రజలు ఆసక్తి చూపడం లేదు. పండుగవేళల్లో గతంలో నెల రోజుల ముందు నుంచే టైలరింగ్ షాపులు కళకళలాడేవి. ప్రస్తుతం వారి జీవితాలు పూటగడవలేని పరిస్థితి నెలకొంది. మండలంలో మొత్తం 500 కుటుంబాలు దర్జీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాయి. కుట్టుపనికి ఉపయోగించే మెటీరియల్, ధరలతో పాటు తదితర సామగ్రి కూడా పెరిగిపోవడంతో గిట్టుబాటు కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. రెడీమెడ్ దుస్తుల వినియోగంపై ఆసక్తి చూపుతుండటంతో దర్జీల కుటుంబాలు కుటుంబ పోషణ కూడా కష్టంగా మారింది. పండుగలు, పుట్టిన రోజులు, చివరికి పెళ్లి రోజుకు కూడా రెడీమెడ్ దుస్తులను కొనుగోలు చేయడంతో దర్జీల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం స్పందించి దర్జీలకు సబ్సిడీ రుణాలు అందించి ఆదుకోవాలని టైలర్ల మండల అధ్యక్షుడు శ్రీను, నాయకులు స్వామి, జమాల్, సాయిబాబు, కోరుతున్నారు.

మరో పని చేయలేక..



తక్కువ ధరకే రెడీమెడ్ దుస్తులు అందుబాటులో ఉండటంతో దర్జీల వద్ద కుట్టించేందుకు ఆసక్తి చూపడం లేదు. 28 ఏళ్లుగా టైలరింగ్ పని చేస్తున్నా. గతంలో పిల్లలకు కుట్టు శిక్షణ ఇస్తూ వారి ద్వారా కొంత వరకు లబ్ధి పొందేవారం. ఇప్పుడు నేర్చుకునువారి సంఖ్య కూడా తగ్గింది. ఇతర పని చేయలేక ఇదే వృత్తిలో కొనసాగుతున్నా.

– శ్రీనివాసులు, టైలర్, కోడేరు

ప్రభుత్వం ఆదుకోవాలి..



గిరాకీ లేక కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం దర్జీలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలి. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి. సీజన్ సమయంలో కూడా ఖాళీగా కూర్చునే పరిస్థితి నెలకొంది. యువకులు, పిల్లలు రెడీమెడ్ దుస్తులు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

– స్వామి, టైలర్, కోడేరు

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా గురువారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, చారకొండ మండలాల్లో టీడీపీ నాయకులు, ఆయన అభిమానులు ఎన్టీఆర్ చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని వక్తలు పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అచ్చంపేటలో సత్యనారాయణ, వెంకటరమణ, కల్వకుర్తిలో న్యాయవాది యాదిలాల్, చారకొండలో సందూరి శ్రీనివాస్ గౌడ్, కొల్లాపూర్‌లో గున్‌రెడ్డి బ్రహ్మానందరెడ్డి, గోవింద్‌గౌడ్, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు

దరఖాస్తుల నమోదు పూర్తి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ప్రజల నుంచి ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల వివరాలను కంప్యూటర్‌లో నమోదు ప్రక్రియను పూర్తి చేసినట్లు ఏపీఓ లక్ష్మణ్ నాయక్ తెలిపారు. గురువారం కార్యాలయంలో ఆయా గ్రామాల వారిగా వచ్చిన దరఖాస్తులను అభయహస్తం, రేషన్‌కార్డులు రెండు విభాగాలుగా వేరు చేసి నమోదు చేశారు. 24 గ్రామ పంచాయతీల నుంచి అభయ హస్తం ద్వారా 10701, రేషన్‌కార్డుల కోసం 3556 దరఖాస్తులు మొత్తం 14266 దరఖాస్తులు అందాయని ఆయన వివరించారు. కార్యదర్శులతో పాటు కార్యాలయ సిబ్బందితో కలిసి వివరాలను కంప్యూటర్లలో నమోదు చేశామని వివరించారు.



నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీఓ